

తహశీల్దార్‌పై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - కడప

విధుల్లో చేరకుండా ఉద్యోగ నిబంధనలను ఉల్లంఘించి, ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేసిన తహశీల్దార్‌ను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా తహశీల్దార్ యు. దస్తగిరయ్యను తిరుపతి జిల్లా నుంచి వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు ఆర్‌డిఒ కార్యాలయంలోని కెఆర్‌ఆర్‌సి తహశీల్దార్‌గా ఉన్నతాధికారులు బదిలీ చేశారు. నిర్ణీత గడువులోగా జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉండగా నిర్లక్ష్యం చేయడంతో మెమో ఇవ్వడమైనది. అయినా ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించడంపై తహశీల్దార్‌ను ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

యూనిట్లు 17 బిల్లు 339

పెరిగిన విద్యుత్ ఛార్జీలతో వినియోగదారులు సతమతం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

'రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తే విద్యుత్ బిల్లులు పెంచబోం'. ఇది 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ. అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలో విద్యుత్ ఛార్జీలను అమాంతం పెంచేయడం ప్రజలను నిశ్చేష్టులను చేస్తోంది. విద్యుత్ ఛార్జీలను పెంచడానికి అనువైన మార్గాలను ఎంచుకుని తన బాదుడే కార్యక్రమం తరహాలో విద్యుత్ ఛార్జీలను బాదేస్తోంది. ఉదాహరణకు కడప కార్పొరేషన్ కాంప్లెక్స్‌లోని 211410106639 విద్యుత్ కనెక్షన్ కలిగిన గదికి డిసెంబర్ బిల్లును పరిశీలిస్తే ఆశ్చర్య పోవాల్సి వచ్చింది. సదరు గది నిర్వాహకులు రోజుకు రెండు నుంచి మూడు గంటలు మాత్రమే గదిలో ఉంటారు. డిసెంబర్‌లో 17 యూనిట్లు మాత్రమే వినియోగించారు. బిల్లును పరిశీలిస్తే రూ.339 ఛార్జీతో గుండె గుబేల్మంది. ఎనర్జీ ఛార్జి కింద రూ.91, ఫిక్స్‌డ్ ఛార్జీ కింద రూ.150, కస్టమర్ ఛార్జీ కింద రూ.30, ఎలక్ట్రిసిటీ డ్యూటీ కింద రూ.17, సర్‌ఛార్జి కింద రూ.25, ట్రూ అప్ ఛార్జీ కింద రూ.18.72 చొప్పున సుమారు ఆరు రకాల అదనపు ఛార్జీలను కలిపి తడిసి మోపెడు బిల్లు రావడం ఆందోళన కలిగించింది. ఈలెక్కన యూనిట్‌కు రూ.22 పైగా పడినట్లు తెలుస్తోంది. కడప నగరంలోని పటేల్ రోడ్డులోని 2114101145 032 నెంబరు విద్యుత్ కనెక్షన్ కలిగిన ఇంటికి ఇదేతరహాలో బిల్లు రావడం ఆందోళన కలిగించింది. డిసెంబర్ మాసంలో 54 యూనిట్లు వినియోగించారు. 54 యూనిట్లకు సంబంధించి రూ.561 బిల్లు వచ్చింది. ఈలెక్కన యూనిట్‌కు రూ.10 పైగా చెల్లించాల్సి దుస్థితి రావడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి తరహాలో విద్యుత్ ఛార్జీల బిల్లుల మాయాజాలం కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇచ్చిన హామీని ఉల్లంఘించి ఇష్టారీతిన 2022 ఏప్రిల్ నుంచి బిల్లుల మోత మోగించడం పట్ల సర్వత్రా విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది.

రూ.100 పెరగడం ఆందోళనకరం



నవంబర్‌లో 78 యూనిట్లు వినియోగానికి రూ.934 వచ్చింది. డిసెంబర్‌లో 66 యూనిట్ల వినియోగానికి రూ.945 వచ్చింది. కరెంటు వినియోగం తగ్గినప్పటికీ రూ.100 వరకు పెరి గింది. అదనపు కరెంటు ఛార్జీలను తగ్గిస్తే ఉపశమనం కలుగుతుంది.

- జి.సురేష్‌బాబు, రాజారెడ్డివీధి, కడప.

ఛార్జీల పెంపును ఉపసంహరించాలి



కరెంటు ఛార్జీల పెంపును ఉప సంహరించుకోవాలి. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో రూ.200 అధికంగా బిల్లు రావడం ఆందోళన కలిగించింది. శీతా కాలంలో వినియోగం తక్కువగా ఉన్నప్పటికీ ఇంత పెరుగుదల ఉంటే వేసవి సీజన్‌లో కరెంటు బిల్లులు చెల్లింపు భారం భరించడం కష్టమే.


- మల్లికార్జునరెడ్డి, నాగరాజుపేట, కడప.

కరెంటు ఛార్జీలను భరించలేకున్నా



విద్యుత్ బిల్లు పెరుగుదల భరించలేకున్నా. నవంబర్ నెలలో రూ.1717 బిల్లు వచ్చింది. దుకాణాన్ని వారం రోజులు మూసేయాల్సి వచ్చింది. అప్పు చేసి బిల్లు చెల్లించాల్సి వచ్చింది.

- వై.చెంద్రాయుడు, మట్టిపెద్దపులివీధి, కడప.



తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లాలో రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య రాకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో తాగునీటి సమస్యలపై ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, శాశ్వత నీటి వనరులను గుర్తించాలని అన్నారు. రానున్న వేసవి కంత జిల్లాలోని చెరువులు, కుంటలు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపాలని అన్నారు. నీటి సరఫరాకు మోటార్లు, పైపులైన్ల మరమ్మతులు యుద్ధ ప్రాతికపదిన చేయాలన్నారు. నీటి సరఫరాకు సంబంధించి పనులు ఉంటే వెంటనే ప్రతిపాదనలు చేయాలని అన్నారు. ఏవైనా చిన్న చిన్న మరమ్మతులుంటే పూర్తి చేయాలన్నారు. ప్రజలకు నీటి కొరత లేకుండా ప్రాంతాలవారీగా నీటిని సరఫరా చేయాలన్నారు. జిల్లాలో తాగునీటిని నిరంతరంగా పరసరా చేసేందుకు శాశ్వత పనులను చేపట్టాలని అన్నారు. ప్రజలు నీటి కొరత వలన ఏమాత్రం ఇబ్బందులకు గురి కాకూడదని అందుకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో ఇరిగేషన్ సిఇ శ్రీనివాసులు, ఎస్ఇ వెంకటరామయ్య, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ శ్రీనివాస మూర్తి, డిఇ చెన్నకేశవ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ రమణమూర్తి పాల్గొన్నారు.



అధికారునుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్

పదవ తరగతి మోడల్ పేపర్ల ఆవిష్కరణ



మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

యుటిఎఫ్ విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో పాటు విద్యార్థుల శ్రేయస్సును కూడా దృష్టిలో ఉంచుకుని ప్రతి ఏడాది మోడల్ పేపర్ల ప్రచురణ నిర్వహిస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. మంగళవారం కడప యుటిఎఫ్ భవన్‌లో 10వ తరగతి మోడల్ పేపర్ల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ పేపర్లను సుదీర్ఘ అనుభవం, విషయ నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల చేత రూపొందించామని పేర్కొన్నారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నా పత్రాలు, సమాధానాలు తెలుగు, ఇంగ్లీష్ మీడియాల్లో ముద్రించామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని కేవలం రూ.75 మాత్రమే ధర నిర్ణయించామని తెలిపారు. ఈ మోడల్ పేపర్స్ ప్రాధాన్యతను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ప్రశంసిస్తూ యుటిఎఫ్ విద్యార్థుల శ్రేయస్సుకు తన వంతు పాత్ర వహించడం ఎంతో ప్రశంసనీయమని, ఈ పుస్తకాలు పదవ తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారన్నారు. తెలివైన విద్యార్థు లు అత్యధిక మార్కులు సాధించడానికి, చదువులో వెనుకబడిన విద్యార్థులు కచ్చితంగా ఉత్తీర్ణత సాధించడానికి ఈ మోడల్ పేపర్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. ఈ ఏడాది కూడా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించుటకు ఈ మోడల్ పేపర్ లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. మోడల్ పేపర్లు కావాల్సిన వారు స్థానిక యుటిఎఫ్ నాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి. రమణ, ఏజాస్ అహమ్మద్, రాష్ట్ర కౌన్సిలర్ కృష్ణారెడ్డి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు సుబ్బారావు, కేదార్నాథ్, గోపీనాథ్, చంద్రశేఖర్, శ్రీకాంత్, ప్రకాష్, జానకిరామ్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ నియామకాలకు గ్రీన్‌సిగ్నల్

ఉమ్మడి జిల్లాలో 14 కమిటీలు ఏర్పాటు
రిజర్వేషన్ ప్రాతిపదికన సభ్యుల ఎంపిక
రెండేళ్లకు ఒకరు చొప్పున రొటేషన్
మార్కెటింగ్ శాఖ మెమో జారీ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వ్యవసాయ మార్కెట్ కమిటీల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మెమో మంగళవారం జారీ చేసింది. ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, కమిటీ గౌరవాధ్యక్షులైన ఎమ్మెల్యేల సహకారంతో నిబంధనలకు అనుగుణంగా నియామకాలు చేపట్టాలని గైడ్‌లెన్స్ జారీ చేసింది. ప్రతి వ్యవసాయ మార్కెట్ కమిటికి 20 మంది చొప్పున పాలకమండలి సభ్యులను ఎంపిక చేయాల్సి ఉంది. వీరిలో ఒకరిని చైర్మన్‌గా ఎన్నుకుంటారు. పాలక మండలిలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, మహిళల కేటగిరీల ప్రకారం ఎంపిక ఉండాలని సూచించింది. ఉమ్మడి కడప జిల్లాలోని కడప, బద్వేల్, సిద్ధవటం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, సింహాద్రిపురం, కమలాపురం, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, కోడూరు, రాజంపేట, యర్రగుంట్ల, వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్న సంగతి తెలిసిందే. వీటికి రెండేళ్లకు ఒకరిని చొప్పున రొటేషన్ పద్ధతిన నియమించాలని ఆదేశాలు ఎంపిక చేసింది. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు కలెక్టర్ జారీ చేయనున్న రోస్టర్ ఆధారంగా సంబంధిత కమిటీలకు గౌరవాధ్యక్షులైన ఎమ్మెల్యేల సలహాలు, సూచనలతో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. ఏదేమైనా రెండు వారాల్లోపు వ్యవసాయ మార్కెటింగ్ పాలకమండళ్లకు కొత్త నాయకత్వం అందుబాటులోకి రానున్నట్లు తెలుస్తోంది.

శనగ పంటలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి -కమలాపురం టౌన్

శనగ పంటకు తెగులు ఆశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కెవికె శాస్త్రవేత్త వి. శిల్పకళ పేర్కొన్నారు. మండలంలోని కోగటం, ఎర్రగుడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మపీడీ విజయలక్ష్మి, డిఆర్‌సి ఎఓ పద్మజ, సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, ఎఓ సరస్వతితో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలిచ్చారు. ముఖ్యంగా శనగ పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆకు మాడు తెగులు ఆశించిన శనగ పంటను పరిశీలించి నివారణకు ఏయే మందులు వాడాలో రైతులకు తెలియజేశారు. ఈనెల 15లోగా పంటల బీమా చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. రబీలో సాగు చేసే వరి పంటకు ఈనెల 31 వరకు కాల పరిమితి ఉందని ఎఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు. **వల్లూరు :** శనగ పంటలో తగు జాగ్రత్తలు తీసుకున్నప్పుడే రైతులు అధిక దిగుబడి పొందుతారని కెవికె శాస్త్రవేత్త శిల్పకళ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గోటూరు, తోల గంగన్నపల్లి లో రైతులు సాగు చేస్తున్న శనగ, మినుము పంటలను పరిశీలించారు.

హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప : తమ హక్కులను ప్రతి ఒక్కరూ సద్వి నియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్ బాబా ఫక్రు ద్దీన్ అన్నారు. మాన వహక్కుల దినో త్సవాన్ని పురస్క రించుకొని మంగళవారం జిల్లా కోర్టు లోని న్యాయ సేవా సదన్ లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 1948 ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ మానవ హక్కుల సార్వత్రిక ప్రకటన ఆమోదించిన రోజు జ్ఞాపకార్థం సందర్భంగా డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపుకుం టున్నట్లు తెలిపారు. మానవ హక్కులు అనేవి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులను ఉద్దేశించినవి అని తెలిపారు. కార్య క్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డిఫెన్స్ పి. మనోహర్, న్యాయ వాదులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. **కడప :** హక్కు అనేది అందరికీ సమానమని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు అన్నారు. మానవ హక్కుల దినోత్సవం, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం మంగళవారం స్టెప్ ఆధ్వర్యంలో కడప నగరంలోని జెఎంజె బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్, కళాశాల విద్యార్థినులు, ప్రిన్సిపాల్, యస్. రోజ్ రాణి, స్టెప్, మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సిబ్బంది టి. నాగయ్య, వి.వి. నారాయణ పాల్గొన్నారు.



రాష్ట్ర అధ్యక్షునికి నియామక పత్రం అందజేస్తున్న నేషనల్ చైర్మన్ షా మహమ్మద్

మానవ హక్కులపై అవగాహన అవసరం

కడప అర్బన్ : ప్రస్తుత కాల పరిస్థితిలో ప్రతి ఒక్కరు మానవహక్కుల గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు కాసల కోనయ్య పేర్కొన్నారు. మంగళవారం సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా చైర్మన్ పోతురాజు లోకేష్ అధ్యక్షతన అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. కేక్ కట్ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ తముకున్న హక్కులను తెలుసుకోలేక నిర్వీర్యమైపోతున్నారని, అందులో భాగంగానే ప్రభుత్వం, రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోలేక పోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రమణ, వివిధ విభాగాల ప్రతినిధులు ఓబులేసు, సురేష్, రాఘవ, పాస్టర్ పి.మహేష్, రామకృష్ణ, శిల్పారెడ్డి, సుధాకర్, గౌస్, జాకీర్, ప్రణవతి, చంద్రాయుడు, వెంకటలక్ష్మి, పి.రవితేజ పాల్గొన్నారు.

76వ మానవ హక్కుల దినోత్సవ అవగాహన సదస్సు ఎపి స్టాండింగ్ కమిటీ మెంబర్ సుంకేసుల బాదుల్లా అధ్యక్షతన మంగళవారం ప్రెస్ క్లబ్లో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నేషనల్ చైర్మన్‌షా మహ్మద్, సీనియర్ నాయకులు నజీర్ అహ్మద్, తాహిరుల్లా ఖాద్రి, మన్సూర్ అలీఖాన్, జనవికాస్ తాహీర్, లెబర్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు పగిడాలా పెద్దన్న హాజరయ్యారు. అనంతరం అలీషే ర్‌ను షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు రాష్ట్ర అధ్యక్షులుగా నియమించారు. నియామక పత్రం, ఐడి కార్డు అందించారు. అనంతరం మానవ హక్కుల నాయ కులకు శాలువా, మెమంటోతో సత్కరించారు. **గోపవరం :** బద్వేల్ పట్టణంలోని కన్స్యూమర్, హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎపిసిజెహె చ్‌ఆర్‌పిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపం చంలోని ప్రతి ఒక్కరు ఎలాంటి వివక్ష లేకుండా సమాన హక్కులతో జీవించాలని ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మానవ హక్కుల ఒప్పందం నేటితో 76 సంవ త్సరాలు పూర్తయిందని చెప్పారు. అయినప్పటికీ మహిళలకు చట్టసభల లో రిజర్వేషన్లు కల్పించడం లేదని, బాలికలు, మహిళలపై అత్యాచారాలు, వరకట్న హత్యలు, పరువు హత్యలు, దళితులపై దాడులు అధికమ య్యాయని వాపోయారు. మానవ హక్కులు కాపాడినప్పుడే ప్రజలకు స్వేచ్ఛగా ఆత్మగౌరంగా జీవిస్తారని చెప్పారు. కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్షులు సి.విద్యాసాగర్, జిల్లా అధ్యక్షులు సి.తిరుపాల్, కమిటీ సభ్యులు రాజు, అనిల్, నవీన్, శ్రీను పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న అప్సర్‌ఖాన్

నగర సమస్యలపై చర్చకు సిద్ధమా : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరం సమస్యల పై నిజా నిజాలు నిగ్గు తేల్చేందుకు వైసిపి నాయకులు సిద్ధమేనా అని టిడిపి మైనార్టీ నాయకులు అప్సర్ ఖాన్ బహిరంగ సవాల్ విసిరారు. మంగళవారం 7 రోడ్ల కూడలో బహిరంగ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో అభివృద్ధి ఎవరు చేశారో, అరాచకం ఎవరు చేశారో జనాల్లోకి వెళ్లి అడిగేందుకు టిడిపి నాయకులు సిద్ధమని చెప్పారు. వైసిపి నాయకులకు వచ్చే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. వైసిపి నాయకులు నగరంలో అభివృద్ధి పేరిట విధ్వంసం తప్ప మరేమి చెయ్యలేదన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైసిపి కార్పొరేటర్లు టిడిపి అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎంఎల్ఎ మాధవిపై చేసిన ఆరోపణలను తప్పుబట్టారు. కార్యక్రమంలో టిడిపి నగర ఉపాధ్యక్షులు పఠాన్ మన్సూర్ అలీఖాన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

12న వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి - కడప

జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల స్వయంప్రతిపత్తిలో 'వర్చువల్ హియరింగ్ అండ్ డిజిటల్ యాక్సెస్ టు కన్స్యూమర్ జస్టిస్' అనే అంశంపై ఈనెల 12 న ఉదయం 10.00 గంటలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. మూడు భాషలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ విద్యార్థులు అర్హులు. ఆసక్తిగల విద్యార్థులు తమ పేరును కో- ఆర్డినేటర్ డాక్టర్ వి కృష్ణవేణి, కామర్స్ లెక్చరర్ వద్ద ఉదయం 10 గంటల లోపు నమోదు చేసుకోవాలన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మంగళవారం అమరావతిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. క్లాప్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్, మునిసిపాలిటీలలో 3000 మంది కార్మికులు జిల్లాలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వీరికి జీతాలు సక్రమంగా అందడం లేదని, పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా కట్టడం లేదని తెలిపారు. 10 డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ఉదాత్త చరితుడు 'కట్టమంచి'

ప్రజాశక్తి కడప అర్బన్ : సాహితీవేత్త, విద్యావేత్త, రచయిత, వక్త, ఆదర్శవాది, రాజనీతిజ్ఞుడైన కట్టమంచి రామలింగారెడ్డి ఉదాత్త చరితుడని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. మంగళవారం కడప రెడ్డి సేవా సమితి సమావేశ మందిరంలో కడప రెడ్డి సేవా సమితి, వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం వారు కట్టమంచి రామలింగారెడ్డి 145 వ జయంతిని ఘనంగా నిర్వహించి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్ట మంచి వారు తెలుగు సాహిత్యంలో సరికొత్త భావాలకు, నూతన ఆలోచన రీతులకు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటేశ్వరాచారి, రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, కోశాధికారి గుడ్ల ఆదినారాయణ రెడ్డి, యం రమణయ్య పాల్గొన్నారు.

ఎఎస్ఐ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కడప అర్బన్ : కమలాపురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మరణించిన ఎఎస్ఐ బి. నాగార్జునరెడ్డి కుటుంబానికి ఇన్‌ఛార్జి ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు ఎఎస్‌పి కె.ప్రకాష్ బాబు పోలీస్ వితరణ నిధి నుంచి రూ.2.5 లక్షల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందచేశారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎఎస్ఐ సతీమణి బి. లక్ష్మి కాంతమ్మకు చెక్కు అందచేశారు. ఈ సందర్భంగా కుటుంబ యోగక్షేమాలు విచారించారు. పిల్లల చదువులకు, కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఎన్.జ్యోతి, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్, బి.సెక్షన్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

చెక్కు అందజేస్తున్న అదనపు ఎస్పీ ప్రకాష్ బాబు

వేతనాలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-కాశినాయన : ఆయాలు, వంట ఏజెన్సీలకు వేతనాలు వెంటనే చెల్లించాలని ఎస్‌టియు కన్వీనర్ సుబ్రమణ్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఏడాది జూన్ నుంచి పాఠశాల శుభ్రతలో ఉపాధ్యాయులకు సహకరిస్తున్న ఆయాలకు వేత నాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమ వుతు న్నారన్నారు. ప్రభుత్వం వెంటనే నవంబర్‌కు వేతనాలు చెల్లించాలన్నారు. వంట ఏజెన్సీ కార్మికులకూ వేతనాలు చెల్లించాలన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి-చెన్నూరు : ఎన్నో సంవత్సరాలుగా ఉన్న భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని తహశీల్దార్ సరస్వతి అన్నారు. మంగళవారం మండలంలోని దౌలతాపురంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న భూ వివాదాలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. అనంతరం గ్రామంలోని రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. వినతి పత్రాలను స్వీకరించారు. సమస్యలను 45 రోజులోపల పరిష్కరిస్తారని అన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు అన్నారు

నేడు విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈనెల 11న ఉదయం 9 గంటలకు కళాశాల ఆవరణంలో కోటిరెడ్డి, కోటిరెడ్డి రామసుబ్బమ్మ విగ్రహాలు ఆవిష్కరణ చేస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1973లో కళాశాలను స్థాపించారని, 2023 నాటికి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 14 న స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, కడప నియోజకవర్గ శాసన సభ్యులు మాధవి, గౌరవ అతిథిగా టిడిపి పొలిట్ బ్యూరో శ్రీనివాసరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. విగ్రహాలావిష్కరణకు కోటిరెడ్డి వారసులు డాక్టర్ సుదర్శన్ రెడ్డి, జయ భారత్ రెడ్డి, సుచరిత, పద్మావతమ్మ, హర్షవర్ధన్ రెడ్డి సహకారం అందిస్తున్నారని తెలి పారు. కళాశాలలో ప్రతిభ కలిగిన 18 మంది విద్యార్థులకు నగదు బహుమతిని అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. కళాశాల హాస్టల్లో ఉంటున్న 20 మంది పేద విద్యార్థులకు రాబోయే మూడు సంవత్సరాలు హాస్టళ్లకు అయ్యే ఆర్థిక సాయం అందజేస్తారని పేర్కొన్నారు.




మీడియాతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి

మంత్రి సవిత వ్యాఖ్యలు దారుణం : వైసిపి

ప్రజాశక్తి - కడప

కడప జిల్లా అభివృద్ధిపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత చేసిన వ్యాఖ్యలు దారుణమని వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే వైసిపి పోరాటాలు చేసేందుకు సిద్ధం అని హెచ్చరించారు. మంగళవారం కడప జిల్లా వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను మోసం చేయడానికి, దగా చేయడానికి ఈ ప్రభుత్వం కుయుక్తులు చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికీ ఒక్క పథకం అయినా అమలు చేశారా? అని ప్రశ్నించారు. ప్రజ లకు మంచి చేస్తే తాము కూడా స్వాగతిస్తాం అన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ శాఖలో కీలక ప్రక్షాళన చేసిన ఏకైక వ్యక్తి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని తెలిపారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలు అమ రావతికి తీసుకుని వెళ్లారని విమర్శించారు. వైసిపి మద్దతు దారులకు పింఛన్లు తొలిగించేందుకే సర్వే చేస్తున్నారన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు పులి సునీల్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న అలీఖాన్

న్యాయ విచారణకు ఆదేశించాలి

ప్రజాశక్తి - కడప

నంద్యాల జిల్లా నందికొట్కూరులో లహరి అనే బాలికను రాఘవేంద్ర అనే వ్యక్తి పెట్రోల్ పోసి సజీవ దహనం చేయడం అత్యంత పాశవికమని, ఈ అమానుషంపై న్యాయ విచారణకు ప్రభుత్వం ఆదేశించాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, కడప నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, అఫ్జల్ అలీ ఖాన్ డిమాండ్ చేశారు. కడపలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇలాంటి అమానుషమైన ఘటనలు పునరావతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రధానంగా మహిళలపై దాడులు జరుగుతున్నాయని వాపోయారు. అత్యాచార ఘటనలు, హత్యలు పేట్రేగిపోయాయని విమర్శించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేతలు శ్యామలమ్మ సంజయ్ కాంత నగరాన్ని హమీద్ పాల్గొన్నారు.

12న సిపి బ్రౌన్ 141వ వర్ధంతి సభ

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ 141వ వర్ధంతి సభను 12న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-40 గంటలకు రాజీవ్ మార్గ్‌లోని సి.పి.బ్రౌన్ విగ్రహానికి పూలమాలాలంకరణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీయూ ఇన్‌ఛార్జ్ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, సభాధ్యక్షులుగా ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, విశిష్ట అతిథిగా ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, గౌరవ అతిథిగా కడప నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మనోజ్ రెడ్డి, సాహిత్య విభాగం అధ్యాపకులు ఆచార్య జి.బాలసుబ్రహ్మణ్యం పాల్గొంటారని తెలిపారు.



మొక్కలు నాటుతున్న సిడిపిఒ, విద్యార్థినులు

కెజిబివిలో 'కిశోర బాలికా వికాసం'

ప్రజాశక్తి - వేముల

స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కిశోర బాలిక వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. సిడిపిఒ సునీత మాట్లాడుతూ బాల్య వివాహాలు పట్ల జరిగే అనర్థాలు, రక్తహీనత, పోషక ఆహారం, బాలికల హక్కులు-చట్టాల గురించి వివరించారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ హసీనా, కస్తూర్బా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - ముద్దనూరు

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ప్రధానోపాధ్యాయులు రాజబాబు, శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం మహిళా పోలీసులు ఆకాంక్ష, శివజ్యోతి ఆధ్వర్యంలో బాల్య వివాహ నిరోధ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసే మత గురువులు, పెద్దలు, తల్లిదండ్రులు శిక్షార్హులు అవుతారన్నారు. బాల్య వివాహాలపై టోల్ ఫ్రీ నెంబర్ 1098, ఐసిడిఎస్, పోలీసులు, మహిళా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. బాలబాలికలు వివాహాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ విజయ భాస్కర్, అంగన్వాడీ కార్యకర్తలు, ఎఎన్ఎంలు, మత గురువులు పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని ఐదు సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ బుధవారం విడుదల చేయనున్నట్లు ఎంపిడిఒ కృష్ణమూర్తి తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కసనూరు, హిమకుంట్ల, అంకాలమ్మ గూడూరు, బలపనూరు, సింహాద్రిపురం సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ఆయకట్టు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

జమిలి ఎన్నికల నిర్వహణ అసాధ్యం

ప్రజాశక్తి - వేంపల్లె

జమిలి ఎన్నికలనడం పిచ్చి తుగ్లక్ నిర్ణయమని, ఆచరణ సాధ్యం కాదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జమిలి ఎన్నికల నిర్వహణ చాలంటే 18 రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుందన్నారు. రాజ్యాంగ సవరణలు చేయాలంటే పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ ఉండాలన్నారు. ప్రస్తుత పరిస్థితిలో అది అసాధ్యమన్నారు. ఎన్నికల ఖర్చు తగ్గుతుందనేది సాకు మాత్రమే అన్నారు. మొత్తం బడ్జెట్లో ఎన్నికల ఖర్చు 0.01 శాతం మాత్రమే అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అభివృద్ధికి అడ్డు వస్తుందని చెప్పడం కూడా సాకు మాత్రమే అన్నారు. భారతదేశం సహా ఏ ప్రజాస్వామ్య దేశంలో జమిలి ఎన్నికలు విరుద్ధమని పేర్కొన్నారు. జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారి తీస్తాయని తెలిపారు. ఇప్పటికైనా జమిలి ఎన్నికల నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ను పునరుద్ధరించాలి

వేంపల్లె : బ్రాహ్మణుల సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావాలంటే బ్రాహ్మణ కార్పొరేషన్ను పునరుద్ధరణ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్రావు కోరారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ బడ్జెట్లో రూ.270కోట్లు బ్రాహ్మణ సంక్షేమానికి కేటాయించడం హర్షణీయమన్నారు. ఈ నిధులు సక్రమంగా బ్రాహ్మణులకు వినియోగం కావాలంటే బ్రాహ్మణ కార్పొరేషన్ను పునరుద్ధరించాలన్నారు. మహిళలు చదువుకొని ఇంటి దగ్గర ఉంటున్నారని, వారి సంక్షేమం కోసం వివిధ పథకాలను ప్రవేశపెట్టి సబ్సిడీ రుణాలను మంజూరు చేస్తే ఆర్థికంగా బలోపేతం అవుతారని సూచించారు.

వేంపల్లె అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

వేంపల్లె : వేంపల్లె అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని టిడిపి జిల్లా కార్యదర్శి ఎస్వీ జయరామిరెడ్డి పులివెందుల టిడిపి ఇన్ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్రెడ్డిని కోరారు. కడపలో ఉన్న బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డిని మంగళవారం జయరామిరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన బిటెక్ రవితో మాట్లాడుతూ గత పాలనలో జరిగిన పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని వివరించారు. బిటెక్ను కలిసిన వారిలో రామాంజనేయులురెడ్డి (చంటి), చాగలేరు భాస్కర్రెడ్డి, శివప్రసాదరెడ్డి, పలువురు టిడిపి నేతలున్నారు.

క్రైం కార్నర్

కుందూ నదిలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - చాపాడు



సురేష్ మృతదేహం

మండల కేంద్రమైన చాపాడు గ్రామానికి చెందిన పూజారి సురేష్ (32) అనే యువకుడు కుందూ నదిలో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సోమవారం సాయంత్రం గ్రామ సమీపాన ఉన్న కుందూ నదికి మృతుడు కాల కృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి నదిలో పడి కనిపించలేదు. సురేష్ అన్నదమ్ములు తమ తమ్ముడు ఇంటికి రాలేదని గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం ఉదయం సురేష్ మృతదేహాన్ని గ్రామ సమీపంలోని కుందూ నదిలో గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువకుడు ప్రమాదవశాత్తు నదిలో పడ్డాడా, ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే విషయం తెలియాల్సి ఉంది. మృతుడు పదేళ్లుగా దుబాయిలో జీవనోపాధి పొందుతున్నాడు. అతనికి ఇంకా పెళ్లికాలేదు.

విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతులు పొలంలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, మోటర్లకు రక్షణ లేకుండా పోయింది. మండలంలోని చింతకుంట గ్రామంలో రైతు చంద్రమోహన్ తన పొలంలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని బాధితుడు వాపోయాడు. పోలీసులు, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు చంద్రమోహన్ తెలిపారు.

రాగివైర్లు చోరీ

కమ్మవారిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి రైతు సంజీవాళ్ల వీరమ్మ పొలంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ను దొంగలు పగల గొట్టి, అందులోని రాగి వైర్ను దొంగిలించారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న పొలంలోని ట్రాన్స్ ఫార్మర్ పగులగొట్టి చోరీ చేయడం దారుణమని బాధిత రైతు వాపోయారు. ట్రాన్స్ ఫార్మర్లకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని బాధితురాలు కోరారు.



రాగివైరు చోరీ చేశారని చెబుతున్న వీరమ్మ

వసతి గృహాల్లో సమస్యల తిష్ట


అరకొరగా దుప్పట్లు, ఆరుబయట స్నానాలు, దెబ్బతిన్న కిటికీలు




దెబ్బతిన్న ప్రహరీకి ఏర్పాటు చేసిన రేకు

ప్రజాశక్తి - లింగాల

వసతిగృహాల్లో సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. అవి పరిష్కారం కాకపోవడంతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. చదువుపై శ్రద్ధ పెట్టలేకున్నారు. ఆరుబయట స్నానాలు, దెబ్బతిన్న కిటికీలు, అరకొర దుప్పట్లతో వారు సతమతమవుతున్నారు. విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్లు లేవు. ప్రస్తుతం చలికాలంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు మూలకు చేరిన నీటి శుద్ధి ప్లాంట్లు. ప్రయివేట్ వాటర్ ప్లాంట్ల వద్ద కొనుగోలు చేసిన అరకొర నీటితో గొంతు తడుపుకుంటున్నారు. కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు చదువు సక్రమంగా సాగడంలేదనే విమర్శలున్నాయి. లింగాల మండల కేంద్రంలోని బిసి బాలుర వసతి గృహం, ఎస్సీ బాలుర వసతి గృహంలో ఈ సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. ఎస్సి, బిసి విద్యార్థులు విద్యను అభ్యసించేందుకు ఏర్పాటు చేసిన బాలుర వసతిగృహాల్లో సమస్యలు అనేకం. వసతి గృహాల నిర్వహణను గాలికి వదిలేయడంతో అక్కడ విద్యనభ్యసిస్తున్న 230 మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా విద్యార్థులు ఇంటి బాట పడుతున్నారు. మూడేళ్ల క్రితం ప్రహరీ కూలిపోయింది. దీని నిర్మాణం ఇంతవరకు చేపట్టలేదు. కుక్కలు, విష పురుగులు వస్తుండడంతో దెబ్బతిన్న ప్రహరీ స్థానంలో కి రేకును ఏర్పాటు చేశారు. కిటికీలకు జాలర్లు లేవు. దోమకాటుతో విద్యార్థులు వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ క్రమంలో పతి ఏటా క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉన్న 130 విద్యార్థులు ఆరుబయట స్నానాలు చేస్తున్నారు. చలికాలంలో చల్లని నీటితో కుళాయి కింద స్నానాలు చేస్తున్నారు. వసతిగృహాల నిర్వహణపై ఉన్నతా ధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణ లున్నాయి. కొన్నేళ్లుగా ఈ సమస్యలతో విద్యా ర్థులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వసతి గృహాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి, విద్యార్థుల చదువు సక్రమంగా సాగేందుకు కృషి చేయాలని తల్లిదండ్రులు, పలువురు కోరుతున్నారు.



బిసి బాలుర వసతిగృహంలో నిరుపయోగంగా ఉన్న నీటి శుద్ధి యంత్రం



ఎస్సి బాలుర వసతిగృహంలో ఆరుబయట స్నానాలు చేస్తున్న విద్యార్థులు

బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యం



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మానవ హక్కుల సంఘం నేతలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పని చేయాలని హ్యూమన్ రైట్స్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రెసిడెంట్ గౌతమబోయిన గురుమూర్తి యాదవ్ తెలిపారు. మంగళవారం ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక హ్యూమన్ రైట్స్ ఆఫీసులో మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రాథమిక హక్కులతోపాటు మానవ హక్కులు కూడా కలిగి ఉంటారన్నారు. వాటికి భంగం కలిగినప్పుడు సంబంధిత బాధితునికి న్యాయం జరిగే వరకు రాగద్వేషాలు లేకుండా అండగా నిలిస్తేనే మన కర్తవ్యం నిర్వర్తించినట్లు అని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో మహిళల పట్ల సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారన్నారు. అవినీతికి, అక్రమాలకు పాల్పడుతూ సమాజ అభివృద్ధికి అడ్డుగా ఉన్న వారి పట్ల హ్యూమన్ రైట్స్ సంఘం తరుపున శిక్ష పడేలా చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల లీగల్ సెల్ వైస్ చైర్మన్ కుంటుమల్ల రామ్మోహన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ వైస్ చైర్మెన్ కొత్త మాస్ భాస్కర్ బాబు, జమ్మలమడుగు తాలూకా మహిళా సెల్ చైర్మెన్ అన్నపురెడ్డి రాణి, జమ్మలమడుగు ఎస్సి సెల్ చైర్మెన్ దారా ఓబులేసు, ఎర్రగుంట్ల మండల చైర్మెన్ నల్లబల్లె విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : మానవ హక్కుల దినం సందర్భంగా మహిళా సంఘాల ఐక్యవేదిక ప్రజాసంఘాల ఐక్యవేదిక మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మైదుకూరు రోడ్డులోని అంబేద్కర్ బొమ్మ దగ్గర నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళా ఐక్యవేదిక నాయకురాళ్లు మాట్లాడుతూ ఇటీవల మహిళలపై జరిగిన అఘాయిత్యాలను పేర్కొన్నారు. మహిళలకు కనీసం జీవించే హక్కు కూడా లేకుండా పోతోందన్నారు. ఈ పరిస్థితి మారాలంటే జనాభాలో సగభాగమైన మహిళలు ఓట్లు వేసి గెలిపించుకున్న ప్రభుత్వాలు స్పందించాలన్నారు. రక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ వైస్ ప్రెసిడెంట్ ఉషారాణి, జెవివి సమతా మహిళా విభాగం సునీత, రాయలసీమ విద్యార్థి శక్తి హరిత, విరసం వరలక్ష్మి, రాయలసీమ మహిళా శక్తి లక్ష్మీదేవి, ఎంపిజె సలీం, జమాతే ఇస్లాం నుండి షఫీ ఉల్లా, జమాతే ఇస్లాం మహిళా విభాగం రెహానా, జిఐఓ విద్యార్థులు, చైతన్య మహిళా సంఘం పద్మ, రాయలసీమ విద్యావంతుల వేదిక మహమూద్, ఇస్మాయిల్, దర్బార్ పాల్గొన్నారు.


పాఠాలు బోధించకపోతే కఠిన చర్యలు

పజాశక్తి - వేంపల్లె

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలు బోధించకపోతే కఠిన చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి హెచ్చరించారు. సైన్స్ పాఠాలు బోధించలేదని విద్యార్థులు ఎంఇఒకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు తనఖీ చేసి, ఉపాధ్యాయులను విచారించారు. 8వ తరగతి నుండి ఇంటర్ ప్లస్ విద్యార్థినులతో సైన్స్ బోధనపై అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 5 మంది సైన్స్ ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ వారిలో సమన్వయం లేనట్లు గుర్తించామని డిఇఒ మీనాక్షి చెప్పారు. ఉపాధ్యాయులు ఉండి పాఠాలు చెప్పకపోవడం మంచి పద్ధతి కాదన్నారు. బాధ్యత అనేది ప్రతి ఉపాధ్యాయుడికి ఉండాలని సూచించారు. విచారణలో తెలిసిన వివరాలు మేరకు నివేదికను తయారు చేస్తున్నట్లు చెప్పారు. పాఠాలు చెప్పని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తీరుపై తగిన చర్యలు తీసుకోవాలని డిఇఒకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు.



బోధనపై విద్యార్థులతో ఆరా తీస్తున్న డిఇఒ మీనాక్షి



మాట్లాడుతున్న ఎడిఎ కృష్ణమూర్తి

ప్రభుత్వం దృష్టికి నేలకొరిగిన పంట వివరాలు : ఎడిఎ

ప్రజాశక్తి - చాపాడు

వర్షం తాకిడికి నేలకొరిగిన వరి పంట వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని వ్యవసాయ శాఖ ఎడిఎ కృష్ణమూర్తి తెలిపారు. మండల పరిధిలోని సిద్దారెడ్డిపల్లె, చియ్యపాడు గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ మ్యాగీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎడిఎ మాట్లాడుతూ గత వారంలో తుఫాను కారణంగా 2వేల ఎకరాల వరకు వరి పంట నేలకొరిగిందన్నారు. రైతుల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపు తున్నామన్నారు. మళ్లీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులు వరి నూర్పిడి వాయిదా వేసుకోవాలన్నారు. ఎవరైన వరి కోసి ఉంటే టార్పలిన్ పట్టలతో కాపాడుకోవాలన్నారు. ఈనెల 15లోగా బీమా నిమిత్తం ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో విఎఎలు పుష్పలత, రాము, ప్రకృతి వ్యవసాయ, కిసాన్ బీమా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరు : మినుము పంటను ఆశించిన పల్లాకు తెగులు, కందిలో మారుకా పురుగు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని కొలవలి గ్రామంలో మంగళవారం ఎఒ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కంది, మినుము పంటలను పరిశీలించారు. మినుము పంటలో పల్లాకు తెగులు సోకిన మొక్కలను గుర్తించి సమూలంగా ఎరివేసి కాల్చేయడమో, పూడ్చి పెట్టడమో చేయాలన్నారు. కందిలో మారుకా పురుగు నివారణకు ఒక ఎకరానికి కోరాజిన్ మందు ఒక ఎకరానికి 60 ఎంఎల్, 13.0.45 అనే ఎరువు పొటాషియం నైట్రేట్ను లీటరు నీటిలో 10 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రబీలో సాగు చేసిన ప్రతి పంటను తప్పనిసరిగా ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలన్నారు. శనగ, వేరుశనగ, మినుము, ప్రొద్దుతిరుగుడు, నువ్వు పంటలకు పంట బీమా కింద ప్రీమియం చెల్లించాలని కోరారు.

లింగాల : రబీలో సాగుచేసిన శనగ పంటలో అధిక దిగుబడులు సాధించాలాంటే మెలకువలతోనే సాధ్యమని ఎఒ రమేష్ తెలిపారు. మండల పరిధిలోని వెలిదండ్ల గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శనగ పంటలో పురుగు ఉధృతితో వేరుకుళ్లు సోకుతుందని, రైతులు ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ అధికారులు సలహాలతో అధిక దిగుబడి సాధించాలన్నారు కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.



సరళను సన్మానిస్తున్న జిల్లా అధికారులు

ఘనంగా సర్పంచ్ సరళకు సన్మానం

ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీలో సిఇసి కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మించి, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించి, చైతన్య పరిచినందుకు గ్రామ సర్పంచ్ బోనం సరళను మంగళవారం కడప డిపిఆర్సి భవనంలో జడ్పి సిఇఒ ఓబుళమ్మ, జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి సన్మానించారు. కార్యక్రమంలో ముద్దనూరు ఎంపిడిఒ ముకుందరెడ్డి, ఈఓపిఆర్డీ వీరభద్రుడు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి నరసింహులు, ఆర్డబ్ల్యుఎస్ ఎఇ హరీష్ పాల్గొన్నారు. జిల్లాలో మూడు పంచాయతీలకు అవార్డు రాగా, అందులో ముద్దనూరు ఉండడం హర్షణీయమని ఎంపిడిఒ ముకుందరెడ్డి పేర్కొన్నారు.

మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించాలి : సిఐటియు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించి వారిపై దాడులు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ డిమాండ్ చేశారు. స్థానిక మస్టర్ పాయింట్ వద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోజురోజుకూ మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు, అత్యాచారాలు తీవ్రస్థాయిలో పెరుగుతున్నాయన్నారు. రాయలసీమ జిల్లాల్లో అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. చట్టాలు ఉన్నా అమలు చేసే సరైన ప్రభుత్వ యంత్రాంగంలేక అవి నిర్వీర్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. ఉప ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు సభలు, సమావేశాల్లో మహిళలకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ.. మా ప్రభుత్వం వస్తే మహిళలపైన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకుంటామన్నారు. కానీ ఇప్పుడు పదుల సంఖ్యలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్ట లేకపోతున్నారని విమర్శించారు. నామమాత్రపు ప్రకటనలతో కాలం వెళ్లబోస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి మన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మన్సూర్, కమాల్బాషా, బీమా పాల్గొన్నారు.

లీకేజీకి మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - లింగాల



మండల పరిధిలోని చిన్నకుడాల టిటిడి కల్యాణమండపం సమీపంలో పార్నపల్లె సమగ్ర రక్షిత మంచినీటి పథకం పైపులైన్ లీకేజీకి మంగళవారం అధికారులు మరమ్మతులు చేపట్టారు. వథా నీటితో రహదారి చిన్నపాటి చెరువులా తయారైంది. రాకపోకలకు తీవ్ర అంత రాయం కలిగింది. సమస్యను 'ప్రజాశక్తి' దినపత్రికలో మంగళవారం 'లీకేజీల నిర్వహణ పట్టదా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు అధికారులు స్పందించారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ రమాకుమారి

రైతుల ప్రతి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - చాపాడు

రైతుల నుంచి వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతామని తహశీల్దార్ రమాకుమారి తెలిపారు. మండల పరిధిలోని నెర్రవాడ గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలు ఉన్న రైతులు సమావేశాలల్లో అర్జీ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో 15 మంది రైతుల నుంచి భూ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ భర్త, టిడిపి నాయకుడు గుత్తి వీరనారాయణ యాదవ్ మాజీ జెడ్పిటిసి, టిడిపి బీసీ విభాగం జిల్లా నాయకుడు మేకల బాబు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మేకల సుదర్శన్, రీసర్వే డిటి నారాయణస్వామి, ఆర్ఐ చంద్రశేఖర్రెడ్డి, విఆర్ఓ ఎల్లయ్య, సర్వేయర్ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.



అన్నం వడ్డిస్తున్న ఆస్పత్రి సిబ్బంది

ఆర్సిడిఎస్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం ప్రభుత్వ వైద్యశాలలో ఏడాది కాలంగా ప్రతినెలా రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ(ఆర్సిడిఎస్) వారు గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం తాము సైతం అంటూ ఆసుపత్రి సిబ్బందిలో ఐదుమంది మహిళలు కె.కవళావతమ్మ. పిహెచ్ఎన్ విజయమేరి (హెచ్ఎస్వి), నాగరాణి(ఎంపిహెచ్ఎ), ఆర్.శ్రీలక్ష్మి (స్టాఫ్నర్స్) సి.సునంద (ఎఫ్ఎన్ఒ)ముందుకు వచ్చి పౌష్టికాహార ఏర్పాటుకు ఆర్థికసాయాన్ని అందజేశారు. మంచి కార్యక్రమానికి ఆర్థికసాయం అందించిన మహిళా సిబ్బందికి ఆర్సిడిఎస్ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలమూరు జగన్మోహన్రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది భాగమైనందుకు జాతీయ కన్వీనర్ ఒంటెద్దు రామలింగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుజాత, డాక్టర్ సాంబ శివారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నారాయణరెడ్డి, ఆర్సిడిఎస్ నాయకులు డాక్టర్ మహాదేవరెడ్డి, అనిల్ కుమార్రెడ్డి పాల్గొన్నారు.

తొండూరు : తొండూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం డాక్టర్ రేష్మా ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభయాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అరిపుల్లా, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి విజయ, హెల్త్ ఎడ్యు కేటర్ మల్లయ్య, సూపర్వైజర్ శశికళ, స్టాఫ్ నర్సు స్వరూపారాణి, ఫార్మసీ ఓబులేసు, ల్యాబ్ టెక్నీషియన్ కుమారి, హెల్త్ ఎడ్యుకేట్ ఆఫీసర్ సాయి దివ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ రంగం కీలకం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అన్ని రంగాల్లో సైబర్ సెక్యూరిటీ కీలకమైందని సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ పాండు రంగన్ రవి తెలిపారు. రూరల్ పరిధిలోని కళాశాలలో మంగళవారం బి.టెక్ ఫైనలియర్ అన్ని బ్రాంచ్ల వారికి ఐసిటి అకాడమీ సమన్వయంతో హనీవెల్ సైబర్ సెక్యూరిటీ నిర్వహించిన శిక్షణ తరగతులు, కండక్ట్ చేసిన పరీక్షలో పాల్గొన్న విద్యార్థులకు సరిఫికేట్స్ అందజేశారు. సర్టిఫికెట్లు ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరెడ్డి చేతుల మీదుగా హెచ్ఒడిల సమక్షంలో అందజేశారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ చైర్మన్ వీరకుమార్ రెడ్డి, కరస్పాడెంట్ వీరకళ్యాణ్రెడ్డి ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో కళాశాల యాజమాన్యం